

పులికి కూలర్.. పక్షులకు పరదాలు
హనుమకొండ జూపార్క్‌లోని జంతువులు, పక్షులు ఎండవేడిని తట్టుకునేందుకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు.
- 8లో▸



తెలంగాణ పల్లెలు.. దేశానికే ఆదర్శం
అభివృద్ధిలో దేశానికే తెలంగాణ పల్లెలు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
42°/29°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

22నుంచి ఆర్ట్స్ కళాశాలకు వేసవి సెలవులు
కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలకు సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 12 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభించనున్నామని ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య శనివారం తెలిపారు. కాగా, ఈ నెల 29వ తేదీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

లండన్‌ రాయల్ సొసైటీ ఫెలో మెంబర్‌గా నిట్ ప్రొఫెసర్


కాజీపేట అర్బన్: లండన్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో మెంబర్‌గా నిట్ వరంగల్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ వెంకటత్రి శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకటత్రిని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్ వైఎన్.రెడ్డి, సిబ్బంది అభినందించారు.

కేయూకు నేడు పనిదినం
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకులు, ఉద్యోగులకు ఆదివారం కూడా పనిదినంగానే పరిగణిస్తూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సర్క్యులర్ జారీచేశారు. యూనివర్సిటీకి న్యాక్ టీం రానునన్న నేపథ్యంలో వివిధ విభాగాల్లో పనులు కూడా జరగుతున్నాయి. ఈ క్రమంలో అధ్యాపకులు, ఉద్యోగులు విధిగా హాజరుకావాల్సింటుంది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం
12గంటల పాటు గానాలాపన



హన్మకొండ చౌరస్తా: ఇద్దరు గాయనీగాయకులు ఒకటి, రెండు కాదు 158 పాటలు, నాలుగు భాషల్లో నిర్విరామంగా 12గంటల పాటు ఆలపించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. సాయి అసోసియేట్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోక హోటల్ వేదికగా శనివారం సాగిన నిర్విరామ స్వర సంగమం ఆహుతులను మైమరిపించింది. కార్యక్రమాన్ని అసోసియేట్ చైర్మన్ కేవీ నాగలక్ష్మి, సత్యసాయిబాబాలతో కలిసి బీసీ సంక్షేమ శాఖ డీఈ పుష్ప జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు డాక్టర్ జయప్రకాస్, పద్మజలు తమ గానామృతంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నట్లు ఫౌండర్ డాక్టర్ చింతపట్ల వెంకటచారి ప్రకటించారు. ఈ సందర్భంగా జ్యూరీ సభ్యుడు టీవీ అశోక్‌కుమార్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సమక్షంలో గాయకులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ఏహెచ్ తులసీరాం వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ఏఆర్‌కే ఈవెంట్స్ సభ్యులు రామకృష్ణ, కడలి శిరీష, క్రిష్, తానా కోఆర్డినేటర్ పీఏఎస్ భానుమూర్తి, కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి 7 జీపీఏ, ఆపై ఫలితాలను సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, వికలాంగ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆకట్టుకున్న నరసింహ అవతార నృత్యరూపకం


కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం చిన్నారుల నరసింహ అవతారం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హుజూరాబాద్‌కు చెందిన నాట్యకళా మందిర్ వ్యవస్థాపకురాలు, సినీ దర్శకురాలు సీతారత్నం శిష్యుల హిరణ్య కశ్యపుడి మరణం , లక్ష్మీనరసింహుడి కల్యాణాన్ని నాట్య రూపకంగా ప్రదర్శించారు. చిన్నారులను ఆలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి సన్మానించారు.

ఫొటోగ్రఫీ ఇష్టం..



నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

- నాడు బ్రిటీష్ వాళ్లను గడగడలాడించిన కుర్ధా మా ఊరు
- నేడు పోరాటాల గడ్డ ఓరుగల్లులో ఉద్యోగం
- ప్రభుత్వ బడిలోనే చదువుకున్నా
- ప్రతి ఏడాది మా బలగం కలుసుకుంటాం
- భవిష్యత్ గురించి తెలిసేవరకు తల్లిదండ్రులు పిల్లల వెనకాల
- 'సాక్షి'తో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

సండే స్పెషల్

నాకు చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీ, బ్యాడ్మింటన్ ఆట అంటే ఇష్టం. వివిధ ప్రాంతాలను సందర్శించడం నా హాబీ. ఫ్యామిలీతో కలిసి టూరిస్ట్ స్పాట్‌లకు వెళ్లినప్పుడు నేనే ఫొటోగ్రాఫర్‌గా మారిపోయి అందమైన చిత్రాలను బంధిస్తా. చిన్నప్పుడు ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వ కాలేజీలోనే ఉద్యోగం చేస్తున్నా' అని అంటున్నారు వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ. ఇటీవల విధుల్లో చేరిన ఆయనను శనివారం సాక్షి పలకరించగా తన కుటుంబ నేపథ్యం, విద్య, ఉద్యోగం, హాబీలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- కాజీపేట అర్బన్

మాది భువనేశ్వర్‌లోని చంపాదార మండలం కుర్ధా గ్రామం. నాడు బ్రిటిష్ వాళ్లను గడగడలాడించిన గడ్డ కుర్ధా. ఆ గ్రామం నుంచి నిజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, ప్రత్యేక తెలంగాణ సాధనలో కీలకభూమిక పోషించిన ఓరుగల్లు గడ్డలో విధులు నిర్వహించడం గర్వంగా, గౌరవంగా ఉంది. మా నాన్న గంగాధర్ సుబుదీ, అమ్మ మాలతి. నాకు అన్నలు ఇద్దరు చక్రధర్ సుబుదీ, మురళీధర్ సుబుదీ, ఇద్దరు అక్కలు రమారాణి, సుష్మారాణిలు ఉన్నారు. అందరికంటే నేనే చిన్నవాడిని. నాకు భార్య జ్యోత్స్న, కుమారుడు మనీష్‌కుమార్ సుబుదీ ఉన్నారు. మా నాన్న కలకత్తాలోని స్టీల్ కంపెనీలో పనిచేస్తూ మాకు అత్యుత్తమ విద్య నేర్పించారు. మా పెద్దన్న ప్రభుత్వ స్కూల్ హెడ్‌మాస్టర్‌గా రిటైర్డ్ అయ్యారు. రెండో అన్న ఇండియన్ రైల్వేస్‌లో సెక్షన్ ఇంజనీర్‌గా రిటైర్డ్ అయ్యారు. అందరం ఉన్నతస్థాయిలో ఉన్నాం. నాన్న స్టీల్ కంపెనీలో సామాన్య ఉద్యోగిగా పనిచేస్తూ మమ్మల్ని మాత్రం ఉన్నత విద్య చదివించారు.

చదువంతా ప్రభుత్వ సంస్థల్లోనే..

నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే సాగింది. పదవ తరగతి వరకు మా స్వస్థలం దగ్గరలోని నారన్‌గర్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో, పూరిలోని సామ చంద్రశేఖర్ జూనియర్ కళాశాలలో ఇంటర్, నిట్ రూర్కేలాలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తయ్యింది. ఎంటెక్ ఐఐటీ ఢిల్లీ చదివా. ఆ తరువాత యూకేలోని షెఫీల్డ్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ, సింగపూర్‌లోని ఎన్‌యూఎస్ కళాశాలలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను పూర్తి చేశా.

చదువుకున్న కాలేజీలోనే మొదటి ఉద్యోగం..

నేను బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుకున్నది ఐఐటీ రూర్కేలాలో. అందులోనే.. నేను చదువుకున్న విభాగంలోనే ప్రొఫెసర్‌గా ఉద్యోగం ప్రారంభించా. దీంతోపాటు అక్కడినుంచి బ్యాంకాక్, కెనడాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టా. ఆ తరువాత పదోన్నతిపై డీన్‌గా సాధించి ఐఐటీ గోవాలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో విధులు కొనసాగిస్తూ మరల పదోన్నతిపై నిట్ వరంగల్ డైరెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నా. నాడు ప్రభుత్వ బడిలోనే చదువుకుని, నేడు ప్రభుత్వ కళాశాలలో విధులు కొనసాగించడం ఆనందంగా ఉంది.



భార్య జ్యోత్స్న, కుమారుడు మనీష్‌కుమార్‌తో బిద్యాధర్ సుబుదీ

ప్రాంతాల విశిష్టతలు తెలుసుకోవడమంటే ఆసక్తి

చిన్నప్పటినుంచి అందమైన ప్రకృతిని కెమెరాల్లో బంధించడం, ఆరోగ్యానికి బ్యాడ్మింటన్ ఆడడం, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి విశిష్టతలను తెలుసుకోవడంలో నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. నేను నిట్ డైరెక్టర్‌గా రాకముందే ఓరుగల్లు నగరానికి రెండు పర్యాయాలు వచ్చి వెళ్లా. డీన్‌గా, సెమినార్‌లో పాల్గొనేందుకు వచ్చా. ఆ సమయంలో నగరంలోని వేయి స్తంభాల దేవాలయం, భద్రకాళీ దేవాలయం, వరంగల్ కోటను సందర్శించా. నగరాన్ని సందర్శించిన తరుణంలో నిజాం రాజులను ఎదురించిన కాకతీయ వీరనారి రాణి రుద్రదేవి గురించి తెలుసుకున్నా. రాణి రుద్రమదేవి స్ఫూర్తితో నిట్ వరంగల్‌లోని గర్ల్స్ హాస్టల్‌కు రాణిరుద్రమదేవి పేరు పెడతాం.

పరిశోధనలపై 8 పుస్తకాలు రాశాను..

నేను చదువుకుంటున్న సమయంలో.. ఇప్పుడు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో రీసెర్చ్ చేయడంపై చాలా ఆసక్తి ఉంటుంది. పోర్టబుల్ సోలార్ ఎనర్జీ, మైక్రో గ్రిడ్‌లపై పరిశోధనలు చేశాను. ఇంకా చేస్తాను. పరిశోధనల్లో భాగంగా ఈ–వెహికిల్స్, పోర్టబుల్ సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రికల్ వెహికిల్స్ చార్జింగ్‌లలో పేటెంట్ హక్కు సాధించా. నేటి తరానికి పరిశోధనలకు ఉపయోగపడే విధంగా నేను చేసిన రీసెర్చ్‌లపై 8 పుస్తకాలను రాశాను. నా రీసెర్చ్‌లకు గాను 2013లో ఒడిశా ప్రభుత్వం సమంత చంద్రశేఖర్ అవార్డు, నిట్ రూర్కేలా అల్యూమ్ని అవార్డు, 2019లో యూకేలోని రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీర్స్ న్యూటన్ ఫెలోషిప్ అవార్డు అందజేశారు.

భవిష్యత్ తెలిసే వరకు పిల్లల వెంట ఉండాలి..

నేను మా ఇంట్లో అందరికంటే చిన్నవాడిని. మా నాన్న నాపై ఎక్కువ ప్రేమ చూపేవారు. చిన్నప్పటినుంచి భవిష్యత్ ఇది అని పిల్లలు తెలుసుకునేంత వరకు తల్లిదండ్రులు వారి వెంట ఉండాలి. మా నాన్న ప్రోత్సాహంతో నేను నిట్ డైరెక్టర్‌గా ఉండగా, నా కుమారుడు మనీష్‌కుమార్ కెనడాలో పీటీసీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తున్నాడు.



మా బలగం పెద్దదే..

మా బలగం ఇద్దరు అన్నలు, వదినలు వాళ్ల పిల్లలు, మా ఇద్దరు అక్కలు బావలు, వాళ్ల పిల్లలు, నేను నా భార్య, నా కొడుకు. మేము ప్రతి ఏడాది మా తండ్రి, తల్లి వార్షికోత్సవాలకు కలుసుకుంటాం. ఎంత బిజీగా ఉన్నా ఆ రెండు రోజుల మాత్రం కలుసుకుని ఒకరి విషయాలను మరొకరం పంచుకోవడం, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటాం.

'ఆజంజాహి' కార్మికులకు ప్లాట్ల కేటాయింపు

నయీంనగర్: వరంగల్‌లోని ఆజంజాహి మిల్ మాడిఫైడ్ వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం–2002 (ఎంవీఆర్‌ఎస్) కార్మికుల 20 ఏళ్ల పోరాటం ఫలించింది. మొత్తంగా 318 మంది కార్మికులకు డ్రా పద్ధతిలో మడిపల్లిలో ప్లాట్లను అలాట్ చేశారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్‌భవన్‌లో వరంగల్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ప్రావీణ్య డ్రా పద్ధతిలో కార్మికులకు నంబర్ల వారీగా ప్లాట్లను అలాట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజంజాహి మిల్లు ఎంవీఆర్‌ఎస్–2002 కార్మికులకు డ్రా పద్ధతిలో పూర్తి పారదర్శకంగా ప్లాట్‌లు కేటాయించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు 200 చదరపు గజాల స్థలం కేటాయించాలని సూచించిన నేపథ్యంలో నేషనల్ టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌నుంచి కార్మికుల నిర్ధారణ జరిపించి, ఉద్యోగుల మాతృసంస్థ నుంచి అనుమతులు తీసుకొని ఆధార్ తదితర సంబంధ డాక్యుమెంట్లతోపాటు బయోమెట్రిక్ విధానంలో వారి పూర్తి సమాచారాన్ని సేకరించినట్లు చెప్పారు. 318 మందికి ప్లాట్ల కేటాయింపు జరపాల్సి ఉండగా, 305 మంది డాక్యుమెంట్లతో హాజరయ్యారు. అందులో ప్రత్యక్షంగా హాజరైన 179 సిబ్బందికి ప్లాట్లను కేటాయించారు. మరణించిన సిబ్బంది కుటుంబాలకు ప్లాట్లు ఇచ్చేందుకు లాటరీ ప్రాసెస్ చేసి నంబర్లు కేటాయించామని, సంబంధిత వారసత్వ ధ్రువపత్రాలు సమర్పిస్తే, నిర్ధారించిన తర్వాత అలాట్‌మెంట్ లెటర్ అందజేయనున్నట్లు తెలిపారు. రెండు వారాలలో రిజిస్ట్రేషన్ చేస్తామని కోర్టు ఉత్తర్వుల మేరకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.



ప్లాట్ల కేటాయింపు డ్రా తీస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పలువురు కార్మికుల ఆందోళన

కార్యక్రమం ప్రారంభానికి ముందు కొందరు కార్మికులు తమకు మిల్లు స్థలంలోనే స్థలాలు కేటాయించాలని ఆందోళన చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఒకవైపు డ్రా జరుగుతుండగానే భర్తను కోల్పోయిన మహిళలు తమకు కూడా ఇప్పుడే ప్లాట్ అలాట్‌మెంట్ చేయాలని ఆందోళన చేశారు. ఎలాంటి వసతులు లేని చోట దూరంగా ప్లాట్లను కేటాయించారని కొందరు కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంవీఆర్‌ఎస్–2002 కార్మిక సంఘం అధ్యక్షుడు ఇప్ప ఆదినారాయణ మాట్లాడుతూ 20ఏళ్ల పోరాటానికి ఫలితంగానే స్థలాలు కేటాయించారన్నారు. కార్యక్రమంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి, సెక్రటరీ డా.మురళీధర్, ఈఈ భీమ్‌రావు, డీఈ రామరవీందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయాలి

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని దిశ కమిటీ చైర్మన్, ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ కమిటీ సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఆరోగ్య, విద్య, భూగర్భ గనులు, పౌరసరఫరాల శాఖల్లోని కేంద్ర పథకాల పనితీరుపై సమీక్షించారు. పథకాల అమలు, ప్రారంభోత్సవాల విషయంలో ప్రొటోకాల్ పాటించాలన్నారు. మైనింగ్‌లో అక్రమాలు అరికట్టాలన్నారు. జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమం వచ్చే నెలలోగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, మెప్మా పీడీ భద్రు, మైనింగ్ అధికారి నర్సిరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ దయాకర్, పక్కన కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రజాప్రతినిధులు

పింఛన్ల నగదు విడుదల

కరీమాబాద్: వరంగల్ జిల్లాకు సంబంధించిన ఆసరా పింఛన్ల నగదు విడుదల చేసినట్లు డీఆర్డీఓ ఎం.సంపత్‌రావు శనివారం తెలిపారు. మొత్తం 1,26,734మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.28,94,74,216 విడుదలైనట్లు పేర్కొన్నారు.



పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూస్తున్న రైతు

ధాన్యం కొట్టుకుపోయింది..

పరకాల మార్కెట్‌లో తడిసిన ధాన్యం

పరకాల/శాయంపేట/ఆత్మకూర్: జిల్లాలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. వారం రోజుల క్రితం అకాల వర్షాలతో కోత దశలోనే పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. రైతులు మిగిలిన ధాన్యాన్ని పరకాల మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి ఆరబోసి ఉంచారు. ఆకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, గాలిదుమారంతో కూడిన వాన రావడంతో రైతులు అక్కడికి చేరుకునేలోపే వర్షానికి ధాన్యం కొట్టుకపోవడంతో లబోదిబోమంటున్నారు. కాంటాల కోసం సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు తడిసిపోగా, సుమారు 200 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- శాయంపేట మండలంలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి తోటల్లోని మామిడి కాయలు నేలరాలాయి. కొన్నిచోట్ల చెట్లు కూకటి వేళ్లతో సహా నేలకూలాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసి మక్కలు, వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.
- ఆత్మకూరు మండలంలో రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్నలు తడిచాయి.



శాయంపేటలో ఈదురుగాలుల ధాటికి కూలిన మామిడిచెట్టు



ఆత్మకూర్‌లో తడిసిన మొక్కజొన్నలు



పరకాల మార్కెట్‌లో తడిసిన దాన్యం బస్తాలు

చెట్టుమీదపడి గీత కార్మికుడు మృతి



శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొల్లం అశోక్ (49) రోజు మాదిరిగా తాటిచెట్లు గీసి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి తుమ్మచెట్టు విరిగి ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో అశోక్ అక్కడికడే మృతిచెందాడు. మృతుడి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని నర్సక్కపెల్లి గ్రామంలో రూ.25 లక్షలతో నూతనగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీలకు అతీతంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కుల వృత్తులను ప్రోత్సహిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నాయని, దానికి కారణం కేసీఆర్ ఆలోచనలేనని, అవే అవార్డుల రూపంలో వస్తున్నాయన్నారు. కాగా, తమను రెగ్యులరైజర్ చేయడాన్ని హర్షిస్తూ పలువురు వీఆర్‌ఏలు.. ఎమ్మెల్యే ధర్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కోడెపాక సుమలత, ఎంపీపీ మచ్చ అనసూర్య, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, రైతు సమన్వయ జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, సర్పంచ్ తిప్పర్తి సాంబశివరెడ్డి, ఎంపీటీసీ బుర్ర దీప దేవేందర్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆరోగ్య భద్రతేది?

- కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెల్త్ పాలసీ లేక ఆర్థిక ఇబ్బందులు
- అనాథలను రక్షించే క్రమంలో అనాథలవుతున్న కుటుంబాలు
- హెల్త్‌పాలసీ ముఖ్యులకు విన్నవించినా ఫలితం శూన్యం
- చిరంజీవి మృతితోనైనా ప్రభుత్వం మేల్కొవాలంటున్న ఉద్యోగులు

'నాన్నా.. నువ్వు అనాథ బాలలు.. వెట్టి చాకిరీ చేస్తున్న బాల కార్మికులు.. ఇంటి నుంచి పారిపోయి వచ్చిన పిల్లలకు సంరక్షణనిచ్చే బాలల సంరక్షణ విభాగంలో పని చేస్తున్నావంట.. ఎందరో అనాథ బాలలకు జీవితమిచ్చిన నువ్వు.. ఇంకా నా ముఖం చూడకుండానే వెళ్లేందుకు ఎలా మనసొప్పింది'.. హరిణి కడుపులోని బిడ్డకు మాటలొస్తే ఆవేదన ఇలా ఉండేదేమో..

వరంగల్ జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పని చేసే రాయపర్తి మండలం కొండూరుకు చెందిన గుండె చిరంజీవి(33) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆయన భార్య హరిణి ఎనిమిది నెలల గర్భవతి. మరికొన్ని రోజుల్లో భూమ్మీదికి వచ్చే ఆ చిన్నారికి.. తన నాన్నను చూసే భాగ్యం లేకుండా పోయింది. హెల్త్ పాలసీ ఉంటే చిరంజీవి బతికేవాడని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

సాక్షి, వరంగల్: ఇలా.. ఒక్క చిరంజీవే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా బాలల సంరక్షణ విభాగంలో పని చేసే వందలాది మంది ఆరోగ్య బీమా లేక అల్లాడుతున్నారు. చాలీచాలనీ జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏటికేడు రెన్యూవల్ చేసే ఉద్యోగం కావడంతో జీవితానికి భద్రత కొరవడింది. సామాజిక సేవ ఆలోచనతో ఎంతో మంది అనాథ బాలురను అక్కున చేర్చుకుంటున్న వీరికి, వీరి కుటుంబాలకు ఆరోగ్య భరోసా లేక ఆగమవుతున్నారు. డీఆర్డీఏ, మెప్మా చివరికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే అంగన్‌వాడీ టీచర్లకు హెల్త్ పాలసీ ఉంటే.. అదే శాఖలో ఓ విభాగంగా ఉండే ఈ ఉద్యోగులకు మాత్రం ఆరోగ్య భద్రత కరువైంది.

విపత్కర పరిస్థితుల్లోనూ సంరక్షణ

24 గంటలపాటు అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించే తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని బాలల సంరక్షణ విభాగంలోని కాంట్రాక్టు ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో హెల్త్ పాలసీ వర్తింపజేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఇతర ప్రభుత్వ ముఖ్యులకు ఉద్యోగులు వినతిపత్రాలిచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం స్పందన రాలేదు. బాలల సంరక్షణ విభాగ ఉద్యోగులు బాల్య వివాహాలు, బాల కార్మికులు, తప్పిపోయిన, విపత్కర పరిస్థితుల్లో బాలలను సంరక్షిస్తుంటారు. ఈక్రమంలో రవాణా సదుపాయం లేని మారుమూల గ్రామాలకు సైతం వెళ్లాల్సి ఉంటుంది. ప్రత్యేక వాహన సదుపాయం లేక వ్యక్తిగత వాహనాలపై వెళ్తుండడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.



బిక్కుబిక్కుమంటూ..

బాలలకు అత్యవసర పరిస్థితుల్లో ఆదరణ, సంరక్షణ అవసరమని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ (ఐసీపీఎస్) కింద అన్ని రాష్ట్రాల్లోని జిల్లాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను ఏర్పాటు చేశాయి. ఒక్కో యూనిట్‌లో సోషల్ వర్క్‌లో డిగ్రీ, పీజీ చదివిన 12 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వీరంతా గత 13 ఏళ్లుగా దాదాపు 70 వేల నుంచి 80 వేల మంది బాలలను గుర్తించి సంరక్షించారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సైతం వైరస్ బారిన పడిన పిల్లల సంరక్షణ కోసం నిత్యావసరాలు, మెడికల్ కిట్‌లు అందించారు. ఈక్రమంలో చాలామంది ఉద్యోగులకు కోవిడ్ వచ్చింది. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. చికిత్స కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. నేరుగా అడుగుదామంటే ఏటా రెన్యూవల్ చేసే ఉద్యోగం. ఒకవేళ తెగించి ప్రశ్నించినా ఏదో కారణంతో మెమోలు ఇప్పించి ఉద్యోగం ఊడగొడతారన్న బిక్కుబిక్కుంటూ భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ ఐటీఐ ప్రిన్సిపాల్ వంగాల మోహన్‌రావు కోరారు. 2023–2024 విద్యా సంవత్సరానికిగాను డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన ప్రకటనలో వివరించారు. ప్రతి విద్యార్థి ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు https://iti.telangana.gov.in వెబ్ సైట్‌లో అప్లికంట్ పై క్లిక్ చేసి న్యూ రిజిస్ట్రేషన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ ఐటీఐ కోడ్ నంబర్ పీయూ36000516గా పేర్కొనాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, పాస్ పోర్టు సైజ్ ఫొటో, సంతకాన్ని జేపీజీ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. కాలేజీ ప్రిఫరెన్స్ స్కీన్‌లో జిల్లా వరంగల్, టైప్: ప్రైవేట్, టీఎస్ ఆర్టీసీ ఐటీఐ వరంగల్‌లో ఆసక్తి ఉన్న ట్రేడ్ నమోదు చేయాలని సూచించారు. ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ ఐటీఐ కళాశాలలో కాని, సమీపంలోని ఆర్టీసీ డిపోలో సంప్రదించాలని కోరారు. డీజిల్ మెకానిక్‌లో 48 సీట్లు, మోటార్ మెకానిక్‌లో 24, పెయింటర్‌లో 20, వెల్డర్‌లో 40 సీట్లు ఉన్నాయని వివరించారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్‌అటీడ్‌కు కనీస అర్హత పదో తరగతి, పెయింటర్, వెల్డర్‌కు కనీస అర్హత ఎనిమిదో తరగతి అని వెల్లడించారు.

మామిడి హరికృష్ణకు పితృవియోగం


సుదర్శన్(ఫైల్)

శాయంపేట: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తండ్రి డాక్టర్ మామిడి సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. స్వగ్రామమైన శాయంపేటలో ఆర్ఎంపీ వైద్యుడిగా సుదర్శన్‌కు మంచిపేరు ఉండడంతో కడసారి చూపు కోసం భారీ సంఖ్యలో గ్రామస్తులు, కళాకారులు తరలివచ్చారు. కళాకారుల విన్యాసాల నడుమ సుదర్శన్ అంతిమయాత్ర కొనసాగింది. డీసీఓ సంజీవరెడ్డి, హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్, మాజీ స్పీకర్ ఓఎస్‌డీ గడ్డం భాస్కర్, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ సందర్శించి భౌతికకాయానికి నివాళుల ర్పించారు.

పులికి కూలర్.. పక్షులకు పరదాలు

- జూపార్క్‌లో జీవుల రక్షణకు అధికారుల చర్యలు

న్యూశాయంపేట : పులికి కూలర్.. పక్షులకు పరదాలు.. మూషిక జింకలకు గుడిసెలు.. ఇవి ఇప్పుడు హనుమకొండలోని జూ పార్క్‌లోని జంతువులు పక్షుల రక్షణకు అధికారులు చేపడుతున్న చర్యలు. భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతుండడంతో హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జువాలజీ పార్కు (జూ పార్కు)లో జంతువులు వేసవి తాపానికి గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జంతువులు, పక్షులు డిహైడ్రేషన్‌కు గురికాకుండా చల్లదనంతో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. చిరుత, ఎలుగుబంటి, మూషిక జింకలు ఎన్‌క్లోజర్ల వద్ద కూలర్లు ఏర్పాటు చేసి వేడి నుంచి ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. పక్షులు ఉండే ప్రతి షెడ్‌పై కొబ్బరి మట్టలు కప్పి వాటిపై గడ్డి పర్చి గంటకు ఒకసారి స్ప్రింక్లర్ల ద్వారా నీళ్లు పడేలా ఏర్పాట్లు చేశారు. ఇలా చేయడం వల్ల వేడి తాపానికి గురికాకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

మూషిక జింకల వద్ద గ్రీన్ నెట్..

జూ పార్కులోని మూషిక జింకల వద్ద గ్రీన్ నెట్ పర్చి ప్రతి రెండు గంటలకోసారి నీటితో తడుపుతున్నారు. వాటి వద్ద గుడిసెలు, పందిళ్లు ఏర్పాటు చేసి సందర్శకులకు మూషిక జింకలు కనిపించేలా ఎండ వేడి నుంచి రక్షించేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. నైట్ షెల్టర్ల వద్ద కూలర్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు జింకల కోసం బురదలో తడిసే ఏర్పాటు చేసి వేడి నుంచి రక్షణ పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా బయటి ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 5 డిగ్రీ తక్కువగా ఉండేలా ఏర్పాట్లు చేశారు.


ఎలుగుబంటి ఎన్‌క్లోజర్ వద్ద స్ప్రింకర్లతో నీళ్లు చల్లుతున్న సిబ్బంది


ఆస్ట్రిచ్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్


మూషిక జింకల కోసం ఏర్పాటు చేసిన గుడిసెలు


చిరుతపులి ఎన్‌క్లోజర్‌పై గ్రీన్ నెట్

ఆహార పద్ధతుల్లో మార్పులు..

జూ పార్కులోని అన్ని జంతువులు, పక్షులను నీటిలో ఎలక్ట్రాల్ పోడర్, దానాలో కనిజ లవణాల మిశ్రమాలను కలిపి ప్రతిరోజు ఇస్తున్నారు. శాఖాహార జంతువులకు ఉప్పు గడ్డలను చెట్లకు కట్టి సోడియం సాల్ట్స్ వాటి శరీరంలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు.

వాటర్ గన్స్ ఏర్పాటు..

ఎలుగుబంటి ఎన్‌క్లోజర్ల వద్ద వాటర్‌గన్స్ సాయంతో నీటిని చల్లుతున్నారు. చిరుత పులి ఎన్‌క్లోజర్ వద్ద స్ప్రింకర్ల సాయంతో నీటిని గంటకు ఒకసారి పిచికారీ చేయిస్తున్నారు. దీంతో ఎండ తీవ్రత కొంత మేర తగ్గేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. చిరుతపులి ఎన్‌క్లోజర్ లోపల కూలర్, బయట తట్టుకట్టి నీళ్ల పోసేలా ఏర్పాట్లు చేశారు.

సంరక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



ఎండ వేడిని తట్టుకునేలా జంతువులకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశాం. పక్షులకు గ్రీన్ నెట్ ఏర్పాటు చేసి ఎండతీవ్రతను తగ్గిస్తూ, జింకల ఎన్‌క్లోజర్ వద్ద ఉప్పుగడ్డలను కట్టాం. స్ప్రింక్లర్లతో గంటకు ఒకసారి నీళ్ల చల్లుతున్నాం. జంతువులు, పక్షులకు అందించే ఆహారం విషయం జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జూ పార్కు వైద్యాధికారి

వడదెబ్బతో కూలీ మృతి


యాకమ్మ (ఫైల్)

నెల్లికుదురు: వడదెబ్బకు గురైన ఓ మహిళ చికిత్సపొందుతూ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కేసముద్రం మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన మరాతి యాకమ్మ (65) ఈ నెల 15న ఉపాధిహామీ కూలీ పనికివెళ్లి వడదెబ్బకు గురైంది. దీంతో చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు.

రాఘవారెడ్డిపేటలో..


అనసూర్య (ఫైల్)

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రాఘవారెడ్డిపేటకు చెందిన గొల్లపల్లి అనసూర్య(55) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం శుక్రవారం రోజువారీగా కూలి పనికి వెళ్లివచ్చి అకస్మాత్తుగా ఇంటి వద్ద పడి పోవడంతో కుటుంబ సభ్యులు గమనించి చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. అనసూర్యకు భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

‘ఎస్సార్’లో చేరడానికి టాపర్ల మొగ్గు

- ఐదుగురు టాపర్లకు బీటెక్‌లో ప్రవేశం
- యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి


మాట్లాడుతున్న యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో చేరడానికి టాపర్లు మొగ్గుచూపుతున్నారని ఆ యూనివర్సిటీ చాన్స్‌రల్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఇంటర్‌లో రాష్ట్ర టాపర్‌లుగా నిలిచిన విద్యార్థినులు కె.పూజ(994), వినూత్న గంపాల (993), కొన్యాల దీపిక (992), శ్రీ దివ్య (991), నందిత(990) ప్రవేశం పొందారని చెప్పారు. ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వీసీ జి.ఆర్.రెడ్డితో కలిసి చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి మాట్లాడారు. ఎన్ఈపీ(జాతీయ విద్యావిధానం) అమలులోకి వచ్చాక సమూలమైన మార్పులు సంభవించాయన్నారు. డ్యూయల్ డిగ్రీ కోర్సులతో విద్యార్థులు ఏకకాలంలో రెండు డిగ్రీలు పొందవచ్చన్నారు. డ్యూయల్ డిగ్రీ కోర్సులు ఈవిద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డ్యూయల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కొలువుతోపాటు ప్యాకేజీ ఎక్కువగా వస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎస్సార్ ఆధ్వర్యంలో 187 కళాశాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ విద్యావిధానాలతో నూతన ఒరవడికి అనుగుణంగా సాంకేతిక, సాంకేతికేతర విద్యను అందించేదుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఎస్సార్ కళాశాల ఇంజనీరింగ్ విభాగం 91వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. అటల్ ర్యాంకింగ్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇన్నోవేషన్ అచీవ్‌మెంట్‌లో మొదటి ర్యాంకు సాధించినట్లు చెప్పారు. హెల్త్ సైన్సెస్‌ను కూడా ఎస్సార్ యూనివర్సిటీలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సార్ రిజిస్ట్రార్ డాక్టర్ శేషగిరిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణ పల్లెలు.. దేశానికే ఆదర్శం

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు


బోనమెత్తుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహిళలు

కొడకండ్ల: అభివృద్ధిలో దేశానికే తెలంగాణ పల్లెలు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మక్కపల్లిలో గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం, సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ, పీరీల కొట్టం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి బొడ్రాయి వార్షికోత్సవంలో పాల్గొని జలాభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాదుల ప్రాజెక్ట్ ప్యాకేజీ–6లో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో ఏం జరిగింది, గడిచిన పదేళ్లలో ఏం జరిగిందో ప్రజలు విశ్లేషణ చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తూ సంక్షేమ మహాత్ముడు, రైతు పక్షపాతిగా సీఎం కేసీఆర్ ఖ్యాతి గడించాడని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రైతులకు అన్యాయం జరగొద్దని క్వింటాకు రూ.400 నష్టంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెడగొట్టు పార్టీలని, ఆయా పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణలో అమలవుతున్న తరహాలో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకుండా ఇక్కడ మాత్రం అర్థరహిత విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. కోట్లాది రూపాయలతో లక్ష్మక్కపల్లిని అభివృద్ధిపథంలోకి పయనింపజేశామని, అతి త్వరలోనే సాగునీటి కళను సాకారం చేస్తామని పేర్కొన్నారు. డబుల్‌రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని, ఇళ్లు లేని వారందరికీ ఏడాదిలో స్వంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేలా మంజూరు ఇప్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గీత కార్మికుల కోరిక మేరకు మంత్రి దయాకర్‌రావు కల్లు తాగి టెస్ట్ బాగుందని కితాబునిచ్చారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ సత్తమ్మ, సర్పంచ్, ఎంపీటీసీలు శోభారాణి, రాంకోటి, రామోజీ, కృష్ణమూర్తి, ఉప్పలయ్య, సత్యనారాయణ, సోమ రాములు, పుల్సింగ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బుల్లితెర నటుడి మృతి


బాలు(ఫైల్)


చిరంజీవి(ఫైల్)

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన కుమ్మరి బాలు (32) బుల్లితెర నటుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రొయ్యూర్‌కు చెందిన బాలుకు ఎవరు లేకపోవడంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. టీవీ సీరియల్స్ లో చిన్న పాత్రల్లో నటిస్తూ జీవితాన్ని సాగిస్తున్నాడు. ఈనెల 18న కన్నాయిగూడెం మండలం దేవాదుల గ్రామానికి చెందిన తన స్నేహితుడి వివాహానికి బైక్‌పై హైదరాబాద్ నుంచి వచ్చాడు. వివాహం అనంతరం ఈనెల 19 అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా యాదాద్రి సమీపంలో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలు అక్కడికక్కడే మృతి చెందాడు. బాలు బుల్లితెరలో నటిస్తూ ఇప్పుడిప్పుడే ఎదుగుతుండగా విధి వక్రీంచి ఈ కానరాని లోకాలకు తీసుకెళ్లిందని స్నేహితులు, గ్రామస్తులు వాపోతున్నారు. మృతుడికి భార్య ఉంది.

చికిత్స పొందుతున్న ఉద్యోగి ..

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరంగల్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగి చిరంజీవి సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన గుండె చిరంజీవి(33) వరంగల్ మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా (స్టెనో)గా 2019 నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 15న విధులు ముగించుకుని సాయంత్రం 5.45 గంటలకు చిరంజీవి బైక్ పై కొండూరుకు బయల్దేరాడు. ఈక్రమంలో వరంగల్ హంటర్ రోడ్డు గణపతి ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ చిరంజీవి బైక్‌ను బలంగా ఢీకొట్టి వెళ్లింది. దీంతో చిరంజీవి రోడ్డుపై పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటినా హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనలు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం చిరంజీవి తుదిశ్వాస విడిచాడు. మృతుడి బావమర్ది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే చిరంజీవి భార్య హరిణి ఎనిమిది నెలల గర్భిణి కాగా ఇటీవల చిరంజీవి తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. దీతో కొండూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

పగబట్టిన అనారోగ్యం

- మూడునెలల వ్యవధిలో ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి


పార్వతమ్మ(ఫైల్)

బయ్యారం: అనారోగ్యం ఆ కుటుంబాన్ని పగపట్టిందేమో.. ఒకరి తర్వాత ఒకరిని బలితీసుకుంది. మూడు నెలల వ్యవధిలో కుటుంబంలో ముగ్గురు మృతి చెందిన విషాదకర ఘటన మానుకోట జిల్లా బయ్యారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారానికి చెందిన మాదిని రాములు, పార్వతమ్మ దంపతులకు శ్రీను సంతానం. మూడు నెలల క్రితం రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీను అనారోగ్యానికి గురైతండ్రి మృతి చెందిన నెల రోజులకు మృతి చెందాడు. ఇద్దరి మృతితో షాక్‌కు గురైన పార్వతమ్మ మనోవేదనతో మంచంపట్టింది. ఈక్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించి, పార్వతమ్మ(65) శనివారం ప్రాణాలు కోల్పోయింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


సుమన్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని చంద్రుతండాకు చెందిన బానోతు సుమన్‌నాయక్ (27) ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 16న క్రిమిసంహారక మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. శనివారం మృతిచెందాడు. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుతండాకు చెందిన సుమన్‌నాయక్ గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. అయితే జీతం సరిపోకపోవడంతో రెండు సంవత్సరాలుగా గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబ పోషణ కోసం బంగారం బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. రుణం తీర్చే మార్గం లేక, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన సుమన్ ఈనెల 16న వ్యవసాయ భూమి వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కాగా, మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు.

మహబూబాబాద్‌లో ఇద్దరు యువకులు..


భూక్యా శివ(ఫైల్)


బోడ సాయి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం .. గాంధీపురం గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ భూక్యా శివ(19), కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ శివారు వాజ్యతండాకు చెందిన బోడ సాయి(18) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై గాంధీపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే దారిలో ఉన్న శ్రీనివాస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్ ఎదుట రోడ్డుపై నిలిచి ఉన్న ట్రాక్టరును వీరి ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై రాంచరణ్ తెలిపారు.

ప్రేయసి మోసం చేసిందని యువకుడి బలవన్మరణం


సాయి (ఫైల్)

ఎల్కతుర్తి: ఓ యువతి ప్రేమించి మోసం చేసిందని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూర్ గ్రామానికి చెందిన మండ సాయి(24) అదే గ్రామానికి చెందిన ఓ యువతి మూడు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. కాగా ఆ యువతి నాలుగు నెలల క్రితం హనుమకొండ జులైవాడకు చెందిన గన్నె విష్ణువర్ధన్‌తో పరిచయం పెంచుకొని సాయిని ఇబ్బందులకు గురిచేసింది. ఈక్రమంలో సాయికి విష్ణువర్ధన్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అప్పటి నుంచి సాయి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తన తల్లి మండ సులోచన కూతురు ఇంటికి వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న సాయి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుని మృతికి కారణమైన యువతి, విష్ణువర్ధన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.